క్లుప్తంగా

జాతీయ స్థాయిలో గుర్తింపు అభినందనీయం

గుంటూరు మెడికల్: గుంటూరు కార్పొరేషన్ పరిధిలో కార్పొరేషన్ అధికారులు, బ్యాంకు అధికారులు ఐక్యంగా కృషి చేసి గుంటూరు పట్టణంలో చిరు వ్యాపారులకు ఆర్థిక రుణం అందించడం ద్వారా జాతీయస్థాయిలో గుర్తింపు రావడం అభినందనీయమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలవర్తిపాటి పాండురంగ విఠల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వానిధి పథకం కింద చిరు వ్యాపారులు అధిక వడ్డీలకు అప్పులు చేసి బాధలు పడుతున్న విధానం నుంచి రక్షించడం కోసం కేంద్ర ప్రభుత్వం స్వానిధి పథకం ప్రవేశపెట్టిందన్నారు.

ఆకట్టుకున్న సంప్రదాయ సంగీత కచేరి



నగరంపాలెం: భావి తరాలకు సంప్రదాయ సంగీతాన్ని అందించటమే లక్ష్యంగా నిర్వహిస్తోన్న కార్యక్రమాలు అభినందనీయమని డాక్టర్ వైవీకే దుర్గాప్రసాదరావు అన్నారు. గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలోని అన్నమయ్య కళా వేదికపై నిర్వహిస్తోన్న వాగ్గేయకార మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. డాక్టర్ వై.శైలజ, ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సన్మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ పి.విజయ, ఎంవై.శేషు రాణి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ దుర్గప్రసాదరావు మాట్లాడుతూ కొన్నాళ్లుగా సన్మండలి నిర్వహిస్తోన్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. అనంతరం విదుషి కస్తూరి కమలదీప్తి (విశాఖపట్నం) శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. వయోలిన్‌పై మందా శ్రీరమ్య(చెన్నై), మృదంగంపై బుర్రా శ్రీరామ్(చెన్నై) వాయిద్యాన్ని అందించారు. అనంతరం ఉపాధ్యక్షులు డాక్టర్ రాజరాజేశ్వరి, ఎం.మీనాక్షి, పి.లలితదేవి, కార్యదర్శి ఎ.మంగాదేవి, కోశాధికారి ఎం.విజయలక్ష్మి, ఉప కార్యదర్శి ఎం.మాధవీకృష్ణ పాల్గొనగా, కళాకారులను సత్కరించారు.

విద్యార్థులకు చదువుతో పాటు ఆధ్యాత్మికత అవసరం




తెనాలి: విద్యార్థులు చదువుతోపాటు ఆధ్యాత్మిక ఆలోచనలనలను అలవరచుకోవాలని, సమాజాభివృద్ధికి సహాయపడాలని మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రమేష్‌బాబు సూచించారు. పట్టణానికి చెందిన వడ్లమూడి కోటయ్య చౌదరి ఛారిటీస్ ఏటా నిర్వహిస్తున్నట్టే ఈ ఏడాది ఉపకార వేతనాల ప్రదానోత్సవాన్ని ఆదివారం స్థానిక ఎన్జీఓ కల్యాణమండపంలో ఏర్పాటుచేశారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వడ్లమూడి గోవర్ధనరావు అధ్యక్షత వహించారు. 2024 సంవత్సరానికి 111 మంది విద్యార్థులకు రూ.19 లక్షల ఉపకార వేతనాలను అందజేశారు. సభలో డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ అలవరచుకుని ఇష్టంగా చదువుకుంటే రాణించగలరని చెప్పారు. విద్యాభివృద్ధికి ట్రస్ట్ ఆశయాలను అభినందించారు. అభ్యుదయ కవి డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం ఇస్తున్న ట్రస్ట్ నిర్వాహకుల కృషి గొప్పదన్నారు. విద్యార్థి దశలో కష్టపడి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చెబుతూ సమాజానికి తిరిగి ఏవిధంగా సహాయపడాలనేది విద్యార్థులు ఆలోచించుకోవాలని సూచించారు. పట్టణంలో ప్రముఖ న్యాయవాదిగా గుర్తింపును పొందిన వడ్లమూడి కోటయ్యచౌదరి పేరుతో ట్రస్ట్‌ను నెలకొల్పి, పేద విద్యార్థులకు గత 28 ఏళ్లుగా ఆర్థికసాయం అందిస్తున్నట్టు డాక్టర్ గోవర్ధనరావు గుర్తుచేశారు. ఇప్పటివరకు 450 మంది విద్యార్థులకు 1210 ఉపకార వేతనాల ద్వారా రూ.1.85 కోట్లు పంపిణీ చేశామని వివరించారు. ట్రస్ట్ సభ్యులు వడ్లమూడి బసవప్రసాద్, వడ్లమూడి బసవారావు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ కళాశాలకు రెడ్‌క్రాస్ సొసైటీ గుర్తింపు

గుంటూరు రూరల్: యూత్ రెడ్ క్రాస్ కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించిన తమ కళాశాలకు రెడ్‌క్రాస్ సొసైటీ ఉత్తమ కళాశాలగా గుర్తించి అవార్డును అందజేయటం సంతోషంగా ఉందని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. ఆదివారం గోరంట్ల గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల గుంటూరులో నిర్వహించిన రెడ్ క్రాస్ సొసైటీ అవార్డ్స్ కార్యక్రమంలో తమ కళాశాలను ఉత్తమ కళాశాలగా గుర్తించి అవార్డును అందజేశారన్నారు. అవార్డును జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా కళాశాల అధ్యాపకులు బి జాయిస్, ఆదిలక్ష్మి అందుకున్నారన్నారు. సమాజ సేవ కార్యక్రమాలు, బ్లడ్ క్యాంప్‌లు, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఎంతో మేలు చేస్తున్నట్లు వివరించారు.

కేఎస్ మార్కెట్ షాపుల స్వాధీనం సాధ్యమా..?

- మే నెల 31వ తేదీతో ముగిసిన గడువు
- ఇంత వరకు స్వాధీనం చేసుకోని రెవెన్యూ అధికారులు
- మార్కెట్‌లో అశీలు పేరుతో అక్రమ వసూళ్లు
- కాని ఎటువంటి చర్యలు తీసుకోని అధికారులు



కొల్లి శారదా మార్కెట్‌లోని షాపులు

నెహ్రూనగర్: గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ కొల్లి శారదా హోల్‌సేల్ కూరగాయాల మార్కెట్‌లోని షాపుల విషయమై ఉత్కంఠ కొనసాగుతోంది. లీజు గడువు గత మే నెలతో ముగిసింది. కాని అధికారులు వాటి స్వాధీనానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీనిపై 'సాక్షి'లో శనివారం 'శారదా మార్కెట్' స్వాధీనంపై హైకోర్టు స్టే అనే శీర్షిక ప్రచురితమైంది. స్పందించిన రెవెన్యూ అధికారులు లీజు గడువు ముగిసిన షాపుల స్వాధీనం విషయంలో నిబంధనల మేరకు విధులు నిర్వహిస్తున్నామని, ఎటువంటి అక్రమాలకు పాల్పడలేదంటూ వివరణ ఇచ్చారు.

పూర్తయిన 25 ఏళ్లు లీజు గడువు

1999లో కొల్లి శారదా మార్కెట్‌లో 88 షాపులను నగరపాలక సంస్థ నిర్మించింది. 25 ఏళ్ల లీజు గడువుతో షాపులను కొంత మంది దక్కించుకున్నారు. వీటి గడువు గత నెల మే 31వ తేదీతో ముగిసింది. షాపుల స్వాధీనానికి మూడు నెలల ముందు ఇవ్వాల్సిన నోటీసులను ఐదు రోజుల ముందు ఇచ్చి వారం రోజుల కాల పరిమితితో షాపులను ఖాళీ చేసి నగరపాలక సంస్థకు అప్పగించాలని నోటీసులు జారీ చేశారు. అప్పటి వరకు సైలెంట్‌గా ఉన్న లీజు దారులు సదరు నోటీసులను ఆధారం చేసుకుని హైకోర్టును ఆశ్రయించారు. ఇంత తక్కువ సమయంలో మమ్మల్ని ఖాళీ చేయాలని చెబితే మా పరిస్థితి ఏంటని? మాకు తగిన సమయం కావాలని హై కోర్టును 38 మంది లీజు దారులు ఆశ్రయించారు. కోర్టు వారి విజ్ఞప్తలను పరిగణనలోకి తీసుకుని జూన్ 13వ తేదీ వరకు ఎటువంటి చర్యలు తీసుకోకూడదని స్టే ఆర్డర్ ఇచ్చింది. తిరిగి వారం రోజుల తరువాత ప్రభుత్వ రూల్స్ ప్రకారం కొంత సమయం ఇచ్చి కొల్లి శారదా మార్కెట్‌లోని షాపులను స్వాధీనం చేసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు ఇస్తూ లీజుదారులు వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది.

సెప్టెంబర్ 9కి పూర్తి..

హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి రెవెన్యూ అధికారులు 90 రోజుల షాపులను నగరపాలక సంస్థకు స్వాధీనం చేయాలని నోటీసులు జారీ చేశారు. సదరు నోటీసుల కాలపరిమితి కూడా సెప్టెంబర్ 9కి పూర్తిపోయింది. కాని ఇంత వరకు వారి వద్ద నుంచి షాపులను స్వాధీనం చేసుకోకపోగా వారి వద్ద నుంచి బకాయిలు వసూలు చేయలేదు. ఇందులో కొసమెరుపేమిటంటే... షాపులను స్వాధీనం చేసుకోకపోగా తిరిగి షాపుల వద్ద నుంచే అశీలు వసూలు చేసేందుకు బహిరంగ వేలం నిర్వహించేందుకు సిద్ధపడుతుండటంపై పలు విమర్శలు వస్తున్నాయి.

రోజుకు రూ.8 వేలు వసూలు..

కొల్లి శారదా మార్కెట్‌లో వ్యాపారులు వద్ద నుంచి అశీలు వసూలు చేసేందుకు బహిరంగ వేలం నిర్వహించకపోవడంతో రెవెన్యూ అధికారులే ప్రస్తుతానికి వ్యాపారుల వద్ద నుంచి అశీలు వసూలు చేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. కాని ఇక్కడ రెవెన్యూ అధికారులు వసూలు చేయకుండా టీడీపీ నేతలు వసూలు చేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మార్కెట్‌లో రోజుకు రూ.15 వేలు చొప్పున వసూలు చేసి కార్పొరేషన్‌కు రూ.7 నుంచి 8 వేలు జమ చేసి మిగిలింది తమ జేబుల్లో నింపుకుంటున్నట్లుఆరోపణలు వస్తున్నాయి.

నేడు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'(ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజలు తమ స్థానిక సమస్యలపై అర్జీలు అందించవచ్చని చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు 'డయల్ యువర్ కమిషనర్'

నెహ్రూ నగర్: గుంటూరు నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి సోమవారం డయల్ యువర్ కమిషనర్ (0863–2224202) కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నగర పరిధిలో ప్రజలు తమ స్థానిక సమస్యలైన తాగు నీటి సరఫరా, పారిశుధ్యం, వీధి దీపాలు, సచివాలయ సేవలు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి 0863–2224202 నంబర్‌కి కాల్ చేసి నేరుగా కమిషనర్ దృష్టికి తమ సమస్యను తెలియచేయవచ్చన్నారు.

నృత్య రూపకంలో అల్లూరి జీవితచరిత్ర



అల్లూరి సీతారామరాజు జీవితచరిత్రలో ఓ సన్నివేశం

నగరంపాలెం: ప్రఖ్యాత నాట్య కళాకారిణి డాక్టర్ ఆనందశేఖర్ జయంత్ బృందం నృత్య ప్రదర్శన అలరించింది. రోటరీ క్లబ్, ఠాగూర్ థియేటర్ మెమోరియల్ ట్రస్ట్, భారతీయ విద్యా భవన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ప్రఖ్యాత నాట్య కళాకారిణి డాక్టర్ ఆనందశేఖర్‌జయంత్ నృత్య ప్రదర్శన గుంటూరు మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను నృత్య రూపకంలో ప్రదర్శించిన తీరు సభికులను ఉత్తేజపరిచింది. లైటింగ్ తీరు, సౌండ్‌తో నృత్య రూపకం అలరించింది. అల్లూరి సీతారామరాజు గురించి చదవడం, చిత్రాల్లో వీక్షించడం మినహా, కళ్లకు కట్టినట్లు చూయించడం తొలిసారి కావడంతో కళాకారులను, ప్రేక్షకులను అబ్బురపరిచింది. దాదాపు గంట పాటు నృత్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనందశేఖర్‌జయంత్, ప్రపంచ తెలుగు మహాసభలు– 2026 కన్వీనర్ పి.రామచంద్రరాజు, ఇంటాక్ సంస్థ రాష్ట్ర కన్వీనర్ ఎస్‌వీఎస్.లక్ష్మీనారాయణ, రెడ్‌క్రాస్ నిర్వాహకులు వడ్లమాని రవి పాల్గొన్నారు.

యాదవులకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలి




సోంప్రకాష్ యాదవ్‌ను సత్కరిస్తున్న యాదవ మహాసభ నేతలు

గుంటూరు మెడికల్: అఖిల భారత యాదవ మహాసభ జోనల్ సమావేశం గుంటూరు అరండల్ పేటలోని వైన్ డీలర్స్ అసోసియేషన్ కళ్యాణ్ మండపంలో ఆదివారం జరిగింది. సమావేశానికి అఖిల భారత మహాసభ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి యాదవ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా అఖిల భారత యాదవ మహాసభ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సోంప్రకాష్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షురాలు మహేశ్వరి యాదవ్ హాజరయ్యారు. నాగమల్లేశ్వరి యాదవ్ మాట్లాడుతూ గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఒంగోలు జిల్లాలోని యాదవులు విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఐక్యతగా మెలగాలన్నారు. సోంప్రకాష్ యాదవ్ మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాలు త్వరలో జరగబోతున్నాయని చెప్పారు. నాలుగు జిల్లాల నుంచి యాదవులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు మహేశ్వరి యాదవ్ మాట్లాడుతూ కుల గణన జరగాలని అన్ని రంగాల్లోనూ యాదవులకి రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆవుల వీరశేఖర్ యాదవ్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అఖిల భారత యాదవ సంఘం కమిటీలను ఏర్పాటు చేసి సంఘాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు. సమావేశంలో బొట్ల రామారావు యాదవ్, పూర్ణచంద్రరావు యాదవ్, పీఎం కొండయ్య యాదవ్ ,డాక్టర్ ఉమాపతి యాదవ్ ,తాళ్ల వెంకటేష్ యాదవ్, అంగిరేకుల వరప్రసాద్ యాదవ్, తులసి రామ్ యాదవ్, లక్ష్మీప్రసాద్ యాదవ్, కోలికొండ శంకర్ యాదవ్, ఆళ్ల సాంబశివరావు యాదవ్, శివ యాదవ్, చాముండేశ్వరి యాదవ్, చావాలి పద్మ, శివ పార్వతి, మహాలక్ష్మి, జట్టి వెంకటరమణ, నీలిమ పాల్గొన్నారు.

విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యం

సూర్య బలిజ సంఘం రాష్ట్ర నాయకులు చదలవాడ రఘురాం



విద్యార్థినికి ఉపకార వేతనం అందజేస్తున్న సూర్య బలిజ సంఘం రాష్ట్ర నాయకులు

లక్ష్మీపురం: సామాజిక రాజకీయ ఆర్థిక అభ్యున్నతికి విద్యను ఆయుధంగా చేసుకోవాలని రాష్ట్ర సూర్య బలిజ సంఘం నాయకుడు చదలవాడ రఘురాం పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేట జాషువా విజ్ఞాన కేంద్రంలో జిల్లా సూర్య బలిజ విద్యా సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటు పుస్తకాలు, ఇతర విద్య ఉపకరణాలు అందించే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సంఘ నాయకులు చదలవాడ రఘురాం, కార్యదర్శి మద్దెల కైలాష్ నాథ్ బాబు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా విద్యా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు, విద్య ఉపకరణాలు అందించడంతోపాటు పోటీ పరీక్షలకు కావాల్సిన సాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యా సంఘం రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సూర్య బలిజ విద్యా సంఘం నాయకులు డాక్టర్ చదలవాడ రవి, చదలవాడ వేణు, సిహెచ్.సుధాకర్, సిద్ధబత్తిని విజయ్ కుమార్, సిహెచ్.శ్రీనివాసరావు, పువ్వుల మహేష్, దాసరి సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

బందెలదొడ్డిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

కార్పొరేషన్ కమిషనర్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెంలోని నగరపాలక సంస్థ బందెలదొడ్డిలో ఆవులకు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. ఆదివారం వెంగళాయపాలెంలోని బందెలదొడ్డిని పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో రోడ్ల మీద ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఆవులు, ఎద్దులు, పశువులను ఇక్కడకు తరలిస్తున్నామన్నారు. ఆవులను శుభ్రం చేయడానికి, నీరు బయటకు వెళ్లడానికి వీలుగా ప్లాట్ ఫారం, అదనపు షెడ్‌ని ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. అలాగే మేతకి వినియోగించే గడ్డి తడవకుండా కూడా షెడ్ వేయాలన్నారు. ఆవుల సంరక్షణకు కేటాయించిన సిబ్బంది వివరాలను తమకు అందించాలని, ప్రజారోగ్య అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. గోశాలకు తరలించిన ఆవులను సదరు యజమానులు కావాలని అడిగినప్పుడు, వారికి అప్పగించడానికి నిర్దేశిత ఫైన్, డాక్యుమెంటేషన్ సిద్ధం చేయాలని కోరారు. పర్యటనలో ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ కళ్యాణరావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, ఆనంద కుమార్, టీపీఎస్ లక్ష్మణస్వామి, ఏఈ రవికిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శివ, యశ్వంత్



లక్ష్మీపురం: ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శివ, యశ్వంత్ ఎన్నికయ్యారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల నాసర్ జీ మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్య విధానం వలన అనేక మంది గ్రామీణ ప్రాంత విద్యార్థులు పాఠశాల విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారుగా 70 వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు జీవో నంబర్ 77 వలన ఉన్నత పీజీ విద్యకు దూరమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నారా లోకేష్ జీఓ నంబర్ 77 ను రద్దు చేస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట మీద నిలబడి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు నగరంలో ప్రభుత్వ ఇంటర్మీడియెట్, ఒకేషనల్, డిగ్రీ కళాశాలలను నిర్మించాలని కోరారు. అనంతరం నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శివ, బి.యశ్వంత్, 11 మంది ఆఫీస్ బ్యారియర్స్, సమితి సభ్యులుగా 29 మందిని ఎన్నుకోవడం అభినందనీయం అన్నారు.

క్రీడా నైపుణ్యాలను వెలికితీసే వేదికగా రోటరీఫెస్ట్



క్రీడోత్సవాలను ప్రారంభించి మాట్లాడుతున్న శరత్ చౌదరి, సుబ్బారావు, వడ్లమాని రవి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాల వెలికితీసే వేదికగా రోటరీఫెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో వారం రోజుల పాటు నిర్వహించనున్న రోటో ఫెస్ట్–2024 క్రీడాత్సవాలను ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న శరత్ చౌదరి విద్యార్థులతో కలసి బెలూన్లు ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీసి, మానసిక స్థైర్యం, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించేందుకు ప్రతియేటా అంతర్జాతీయంగా రోటోఫెస్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు గాలి సుబ్బారావు మాట్లాడుతూ అంతర్జాతీయంగా విస్తరించిన రోటరీ క్లబ్స్ ద్వారా సామాజిక ఆరోగ్య చైతన్య కార్యక్రమాలతో పాటు పాఠశాలల్లో సురక్షిత తాగునీరు, క్రీడా పరికరాలు, బెంచీలు వంటి మౌలిక వసతులను సమకూర్చడంతో పాటు వారి శారీరక దృఢత్వానికి రోటోఫెస్ట్‌ను వారం రోజులు పాటు నిర్వహిస్తున్నామని చెప్పారు. తొలిరోజు కార్యక్రమంలో వంద మీటర్ల పరుగు, హై జంప్, లాంగ్ జంప్, 100 మీటర్స్ రిలే రన్, టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. సోమవారం వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ బాస్కెట్‌బాల్ పోటీలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధి వడ్లమాని రవి, పీఎస్ కార్తికేయన్ హీరేన్, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ స్థలాలు చూపించాలి

నెహ్రూ నగర్: గత 20 ఏళ్లుగా బొంగరాల బీడు శ్మశాన వాటిక వెనకాల కార్మిక శాఖ స్థలంలో నివాసముంటున్న యానాది సామాజిక వర్గానికి చెందిన 50 కుటుంబాలకు చెందిన నివాసాలను తొలగించాలని అధికారులు ఆదేశించడం బాధాకరమని బహుజన మహాసేన తెలుగు రాష్ట్రాల గౌరవాధ్యక్షుడు చింతా రాంప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం యానాదులు నివాసం ఉంటున్న ప్రాంతానికి వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు. యానాదులకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపించిన తర్వాత మాత్రమే అక్కడ నుంచి వారిని తరలించాలని కోరారు. అదేవిధంగా యానాదులకు పైలట్ ప్రాజెక్టు కింద ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు వారి పిల్లలకు ప్రభుత్వ హాస్టల్స్‌లో వసతి కల్పించి విద్యను అందించాలని డిమాండ్ చేశారు.

ఫాస్ట్‌ఫుడ్‌తో ప్రాణసంకటం

- నగరంలో పెరిగిపోయిన ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు
- అనారోగ్యం పాలవుతున్న ప్రజానీకం
- పట్టించుకోని కార్పొరేషన్, ఫుడ్ సేఫ్టీ అధికారులు



రోడ్డు పక్కన ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో తయారు చేస్తున్న రంగులు కలిపిన న్యూడిల్స్(ఫైల్)

లక్ష్మీపురం: ప్రస్తుతం ఫాస్ట్ ఫుట్ సంస్కృతి పెరిగింది. నోరూరించే రుచులు ఆకర్షిస్తుంటాయి. ఇంటి వద్ద నుంచే ఆర్డర్ చేస్తే ఆకట్టుకునే రుచులతో సరఫరా చేస్తున్నారు. ఆ రుచుల వెనక ప్రమాదం పొంచిఉందని ప్రజలు గుర్తించడం లేదు. ఎక్కడ బడితే అక్కడే ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తింటున్నారు. ఇది ఓ రకంగా ప్రజల ప్రాణాలతో చెలగాటం వంటిదే. వీటిపై నగర కార్పొరేషన్, ఫుడ్ సేఫ్టీ అధికారులు కానీ అటువైపు చూడడం లేదు. యథేచ్ఛగా ఫాస్ట్‌ఫుడ్ వ్యాపారం సాగిపోతోంది.

ప్రధానంగా నగరంలో..

గుంటూరు నగరంలోని ప్రధానంగా గుజ్జనగుండ్ల మొదలు కొని లక్ష్మీపురం, విద్యానగర్, చంద్రమౌళి నగర్, బృందావన్ గార్డెన్స్, కొరిటిపాడు, అరండల్ పేట, శ్రీనగర్, నెహ్రూనగర్, బ్రాడిపేట, పట్టాభిపురం ,స్తంభాలగరువు, చుట్టుగుంట సెంటర్, ఏటి అగ్రహారం, మార్కెట్ సెంటర్, పల్నాడు బస్టాండ్, నాజ్‌సెంటర్, రైలు పేట, కొత్తపేట, పాతగుంటూరు, సంగడిగుంట, పొన్నూరు రోడ్డు వరకు అదే విధంగా అంతర్గత వీధుల్లో ఫాస్ట్ సెంటర్లు రోడ్డుపై లెక్కలేకుండా ఏర్పాటు చేసుకుని తిండు ప్రియులను ఆకర్షితులు చేస్తున్నారు.

వినియోగించే పదార్థాలు...

ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లలో నాసిరకమైన చికెన్‌ను వెనిగర్‌లో ముంచి తీస్తారు. తెల్లగా మారిన చికెన్‌కు ఆరెంజ్ కలర్ వాడి తాజా రంగులో కనిపించేలా చేస్తున్నారు. ఆ కలర్ చేతిపై పడి నిమిషం వరకు శుభ్రం చేసుకోకుండా ఉంచితే తర్వాత వారం రోజుల వరకు ఆ రంగు పోదు. సెంటర్ల నిర్వాహకులు వినియోగారుల ఆరోగ్యంతో ఆటలాడుతున్నారు. అలాగే వంటకు పామాయిల్‌ను వినియోగిస్తున్నారు. కళాయిలో అడుగున అన్నం అంటుకు పోకుండా ఉండేందుకు ఎక్కువగా పామాయిల్‌ను వాడి, తొందరగా(ఐదు నిమిషాల్లో) పదార్థాన్ని తీసి కస్టమర్లకు అందిస్తున్నారు. కళాయిలను కడకుండా నూనె జిడ్డు పోయేందుకు పాత గుడ్డతో తుడుస్తున్నారు. ఫాస్ట్ ఫుడ్‌లలో ప్రమాదకరమైన అజినోమోటో అనే పదార్థాన్ని చాలా ఎక్కువగా వాడుతున్నారు.

ఆహార కల్తీతో....

సెంటర్‌లలో కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల అనేక రకాల ఆరోగ్య సంబంధిత ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి వచ్చి హాస్టల్‌లలో ఉంటూ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లలో చేసే న్యూడిల్స్, ఫ్రైడ్ రైస్, ఎగ్ రైస్, మంచురియా, ఎగ్, చికెన్ ఫ్రైడ్ రైస్‌లు వంటి వాటికి అలవాటు చేసుకుని రోగాల బారిన పడుతున్నారు. ఇలాంటి కల్తీ ఆహారం తీసుకోవడం వలన విరేచనాలు, కడుపు నొప్పి, వికారం, వాంతులు, కంటి సంబంధిత సమస్యలు, తలనొప్పి, క్యాన్సర్, రక్తహీనత నిద్రలేమి, పక్షవాతం, మెదడు దెబ్బతినడం, అలాగే కడుపు సంబంధిత సమస్యలు, మైకం, కీళ్ల నొప్పులు, కాలేయ రుగ్మతలు ఆహారం కల్తీ అవ్వడం వల్ల తలెత్తుతాయి.

చోద్యం చూస్తున్న నగరపాలక సంస్థ అధికారులు...

ప్రజలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లలో తిని రోగాలు కొని తెచ్చుకుంటున్నారు. గుంటూరు నగరంలోనే ఫాస్ట్ ఫుడ్ బండ్లు మూడు వేలకు పైగా ఉన్నాయి. వీటిని అనుమతి లేకుండా నడుపుతున్నారు. ఒక ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వహించడానికి ఫుడ్ లైసెన్స్ తప్పకుండా తీసుకోవాల్సి ఉంది. అలాగే హానికారమైన పదార్థాలను వినియోగించరాదు. నగరవాసులు కల్తీ ఆహారం తిని రోగాల బారిన పడుతున్న ఇటు నగరపాలక సంస్థ అధికారులు చోద్యం చూస్తున్నారు.

చిరుప్రాయంలోనే మధుమేహం, రక్తపోటు



చిరుతిళ్లలో వంట నూనెలది ప్రధానపాత్ర. చాలా వరకు వాడిన నూనెనే తిరిగి ఉపయోగిస్తూ పదార్థాలను తయారు చేస్తుంటారు. అలాంటి నూనెతో తయారు చేసిన పదార్థాలను ఒక్కసారి తింటే వారానికి సరిపడా ఉప్పు శరీరంలోకి వెళ్తుంది. ఫలితంగా చిరుప్రాయంలోనే బీపీ, షుగర్, రక్తహీనత తదితర సమస్యలు తలెత్తుతాయి. వీలైనంతమేర వీటికి దూరంగా ఉండటం శ్రేయస్కరం.

–డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్

కిడ్నీ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి



లక్ష్మీపురం: కిడ్నీ వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డాక్టర్ వి.వెంకటనాయుడు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా మనం తీసుకునే నీరు, వివిధ ఆహార పదార్థాల మూలంగా మూత్రపిండాలలో రాళ్లు ఏర్పడతాయని వివరించారు. మధుమేహం ఉన్న వారిలో ఈ యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఎక్కువ అని ఇన్ఫెక్షన్ వచ్చిన సమయంలో చలి జ్వరం, మూత్ర విసర్జనలో మంట లాంటి లక్షణాలు కనబడతాయన్నారు. అనంతరం అవగాహన సభ్యులు అడిగిన మూత్రపిండ సమస్యలకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ వెంకట నాయుడును ఘనంగా సత్కరించారు. సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్ గా వ్యవహరించగా డాక్టర్ రమ్య, డాక్టర్ ఏ రవీంద్ర కుమార్, సీనియర్ యోగాచార్యులు ఇందు శేఖర్ పాల్గొని ప్రసంగించారు.